

## ఇ. మైత్రేయస

"మనం మనం ఒకటయిన తర్వాత, యిచ్చి పుచ్చుకోవటాలు కేవలం నామమాత్రం అనుకోండి..."

"అవుననుకోండి... అయినా కూడా ఓ మాట అనుకుంటే తర్వాత తర్వాత అరమరికలు వుండవు.... అంతే నా ఉద్దేశం... మీరు వేరే విధంగా..."

"మీ మాటే మా మాట. యింకా వేరే విధంగా ఆలోచించే ప్రసక్తే లేదు..."

"అట్లాగన్నారు కాబట్టి చెపుతున్నాను ఎట్లాగైనా పిల్లపేర ఓ యకరం పొలం రాస్తా అన్నారు. పెళ్ళయిన తర్వాత పిల్లేమిటి పిల్లాడేమిటి। ఇద్దరూ ఒకటేగా ...అందుకనే యీ పెళ్ళి ముందరే ఆ యకరం మావాడి పేర రాసేస్తే యెట్లా వుంటుందంటారు..."

"నాకేం అభ్యంతరం లేదు. అయితే ఆ ఆస్తి తగాదాలు కోర్టులో వున్నాయి. ఓ కొలిక్కి యెప్పుడొస్తాయో యేమో। రెండేళ్ళపట్టి చెపుతున్నాడు మా ప్లీడరు.

యీ నెల్లో అయిపోతుంది, యీ నెల్లో అయిపోతుందని. ఇంతవరకు కాలేదు. ఆ మాటల భరోసామీద మీకు మాటిస్తే, అది కాకపోతే అభాసు అవుతుంది... ఏమంటారు..."

"ఇంతకీ యేమంటారు..."

"నే ననేదేముంది. ఆ నాలుగెకరాల పొలం మాది అని నిక్కచ్చిగా కోర్టు వారు తీర్పు యిచ్చిన మరుక్షణంలో మీరు యెవరికి రాయమంటే వారికి రాసిస్తాను ఆ యకరం పొలమూనూ—"

"మీతో అన్నీ మొదటినుంచి కూడా మడతపేచీలుగానే వున్నాయి. ప్రద్దానికి యేదో ఒకటి అడ్డం..."

"నన్నేం చెయ్యమంటారు చెప్పండి"

"మీరు చెయ్యాల్సిన పనికూడా నన్నే అడుగుతున్నారు. ఇది చాలా బాగా వుంది... అస్సరే గానీ, మేము అడిగిన అయిదు తులాల బంగారం సంగతి యేం చేశారు..."

"మొదట్లో మేము తూగిన మాట నిజమే. మా మనస్సులో అయితే యిప్పటికీ ఆ బంగారం యివ్వాలనే వుంది. కాని తీరా లెక్కలు వేసి చూస్తే యీ పెళ్ళి ఖర్చే చాలా అయ్యేటట్టుంది. ఇప్పుడే ఆ భారాన్ని నెత్తిన వేసుకో గలమా అనే అధైర్యం వచ్చిపడింది. సమయం చూసి సర్దుతాను... ఇప్పటికి మాత్రం—"

"ఈ బంగారం సంగతి అడగొద్దంటారు అంతేగా..."

"అబ్బెబ్బె నే నట్లా అనలేదే..."

"ఇంకా యేమనాలి చెప్పండి... సరే కానీండి. ఇహ వెండి కంచం, వెండి చెంబు విషయం కూడా యిట్టాగే దాటేస్తారా యేమిటి?"

"మీరట్లా అనుకుంటే మేమేం చెప్పగలం... అంతా మీకు తెలిసింది. మా అమ్మాయి కవుతే వెండి ఆకు యేనాడో కొని దాచి వుంచాం, ఈ సమయానికి అక్కరకు వస్తుందని. అది కాస్తా మీ అబ్బాయికే చదివిస్తాం పెళ్ళిలో. ఇంకా వెండి కంచం అంటే భారం అవుతుంది గదా..."

"సరే బాగానే వుంది... వెండి చెంబు ప్రస్తుతం వాయిదా వేశామంటారు, అంతేగా."

"ఇది మాత్రం వాయిదా వేయటం కాదులెండి... ఈ రోజుల్లో వెండి చెంబు అంటే నవ్వుతారు. మనం కూడా కాలమాన పరిస్థితులను బట్టి నడుచుకోవాలి గదా... అందుకని దాన్ని గురించి పట్టుబట్టకండి..."

"భేషుగ్గా వుందండి మీ సమాధానం"

"మా సమాధానం నచ్చినందుకు చాల సంతోషం..."

"పట్టుబట్టల విషయంలో కూడా నేను అడక్కమునుపే, మీ ఉద్దేశమేమిటో చెప్పేసెయ్యండి..."

"దీంట్లో చెప్పటానికేముందండి. ఈ పాంట్, షర్టులమీద భోజనాలు చేస్తుంటే యీ పట్టుబట్టలమీద మోజు యెవరికండీ ...ఏదో మీరు పురాతన పద్ధతుల ప్రకారం అడిగేస్తున్నారు కావీండి..."

"పోనీ మీరు నవీన పద్ధతుల ప్రకారం యేమిస్తారు చెప్పండి. పోనీ అదీ చూద్దాం..."

"మీరు చాల చమత్కారంగా మాట్లాడతారే..."

"దీంట్లో చమత్కారం యేమిటో నాకు అర్థంకావటం లేదు... సరేగాని చెప్పండి..."

"నాకు యిప్పుడే తెలిసింది. మీ అబ్బాయి స్కూటర్‌కు డబ్బు కట్టాట. యీ నెలలో వచ్చేస్తుందిట. ఇహ దాని విషయం నేను ఆలోచించటం అనవసరం. పోనీ ఓ కలర్ టి.వి సెట్టు కొని ఇద్దామంటే, రెండేమి చేసుకుంటారు చెప్పండి. అయినా మీ యింట్లో రెండో సెట్టు పెట్టే చోటు కూడా కనిపించలేదు—ఏమంటారు... ఏమిటి అట్లా చూస్తున్నారు..."

"చెప్పండి! మధ్యలో ఆపటం యెందుకు? నే నెట్లా చూస్తే మీ కెందుకు గాని..."

"అదేమన్న మాట... మీ కనుసన్నల్లోనే మేము నడుచుకోవాల్సిన వాళ్ళం..."

"ఇందాకటి మంచి మీరు చేస్తుంది అదేగా..."

"చాలా సంతోషం. నా మనస్సు పూర్తిగా అర్థంచేసుకున్నారు—ఇంతకీ నే చెప్పొచ్చింది యేమంటే, చేతివేళ్ళల్లో నాలుగు ఉంగరాలు వుండనే వున్నాయి మీ అబ్బాయికి. నేనో ఉంగరం చేయించినా, ఎక్కడ చోటేది... ముంజేతికి రిస్టువాచ్ వుండనే వుంది. నే నేమన్నా యిచ్చినా మీ దగ్గర లేందే యివ్వాలి గదా!..."

"ఇంతకీ మీరేమిస్తారు మా అబ్బాయికి నిక్కచ్చిగా చెప్పేసెయ్యండి..."

"మా అమ్మాయిని...!!"

